క్లుప్తంగా

పార్టీలకతీతంగా పథకాలు అందజేయాలి

మునిపల్లి(అందోల్): రాజకీయ పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయాలని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. మండలంలోని ఖమ్మంపల్లి గ్రామ శివారు జెడ్పీటీసీ ఫాంహౌస్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మంజూరు చేసిన సంక్షేమ పథకాలతో పాటు పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారుల జాబితాలో ఉన్న అర్హులకు సంక్షేమ పథకాలు అందజేయాలన్నారు. ఆరు గ్యారంటీల పథకాల దరఖాస్తుల స్వీకరణలో ఎలాంటి స్పష్టత లేదన్నారు. అభయహస్తం ఆరు గ్యారంటీల పేరుతో ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు. చీలపల్లి సర్పంచ్ వీరన్నపాటిల్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు సాయికుమార్, శివశంకర్, మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

బోరుమోటారు ప్రారంభం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని నాగులపల్లి గ్రామంలో సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి తన సొంత నిధులతో వేసిన బోరుమోటారును శుక్రవారం డీసీసీ అధ్యక్షురాలు నిర్మలారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గడీల రాంరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో నీటి సమస్య తీవ్రంగా ఉందని తన దృష్టికి తీసుకురావడంతో సొంత ఖర్చులతో బోరు మోటారు వేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గడీల రాంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సిద్దన్న, సర్పంచ్ భూపాల్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్, నాయకులు రాజు, నాగుశెట్టి పాల్గొన్నారు.

దరఖాస్తులు విక్రయిస్తే చర్యలు

నారాయణఖేడ్: అభయహస్తంకు సంబంధించిన దరఖాస్తు ఫారాలను జిరాక్స్ కేంద్రాలు, ఇతర దుకాణాల్లో విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఖేడ్ మున్సిపల్ కమిషనర్ గోపు మల్లారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. దరఖాస్తు ఫారాలను వార్డు అధికారులే గడపగడపకు వచ్చి అందజేస్తారని తెలిపారు. వాటిని పూరించి ప్రజాపాలనలో భాగంగా నిర్వహిస్తున్న గ్రామసభల్లో అధికారులకు అందజేయాలని సూచించారు. ఎవరైనా దరఖాస్తు పత్రాలను విక్రయిస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి టౌన్: ఐటీఐలో స్థిరమైన విద్యార్థులకు పాలిటెక్నిక్ సంవత్సరంలో బ్రిడ్జ్‌కోర్స్ ప్రవేశం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంగారెడ్డి ఐటీఐ ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 60శాతం మార్కులతో ఐటీఐలో రెండు సంవత్సరాలు కోర్స్ పూర్తి చేసిన విద్యార్థులు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలన్నారు. జనవరి 31వ తేదీ వరకు మెరిట్ ఆధారంగా ప్రవేశానికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.

శ్వాసకోశ వ్యాధితో వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: శ్వాసకోశ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన కృష్ణ రెండు నెలల క్రితం బతుకు దెరువు కోసం వచ్చి పటాన్‌చెరు మండల పరిధిలోని ఇంద్రేశం గ్రామ శివారులో ఇటుకబట్టిలో పని చేసుకుంటూ అక్కడే జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో కొంతకాలంగా శ్వాసకోశ వ్యాధితో బాధపడుతున్న కృష్ణ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు ఈశ్వర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోలర్ స్కేటింగ్‌లో విద్యార్థిని ప్రతిభ

పటాన్‌చెరు టౌన్: గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్స్‌కు చెందిన బీఏ సైకాలజీ మూడో ఏడాది విద్యార్థిని రియా సబూకు రోలర్ స్కేటింగ్‌లో ప్రతిభ చాటి ఒక బంగారు, రెండు రజత పతకాలను గెలుచుకుంది. ఇటీవల చెన్నైలో నిర్వహించిన 61వ జాతీయ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించిన ఆమె అత్యుత్తమ ప్రదర్శనను చాటి కీర్తిని తెచ్చిపెట్టింది. రియా అసాధారణ విజయాన్ని హ్యుమానిటీస్ డైరెక్టర్, స్పోర్ట్ డైరెక్టర్లు విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

వరద బాధితులకు చేయూత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తమిళనాడు వరద బాధితులకు తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ సభ్యులు అండగా నిలిచారు. తెల్లాపూర్ నైబర్హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.5 లక్షల విలువైన దుస్తులను సేకరించి శుక్రవారం లారీల్లో వరద బాధితులకు తరలించారు. ఈ సందర్భంగా తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరగారి రమణ మాట్లాడుతూ తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. గతంలో సైతం వరద బాధితులకు అండగా నిలిచామని గుర్తు చేశారు. తమిళనాడులో వచ్చిన వరదలకు అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, తమ వంతు బాధ్యతగా దుస్తులను సేకరించి పంపించినట్లు వివరించారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు దీప్తి, కతిరేసన్, రవికిరణ్, రవి, రమణ పాల్గొన్నారు.

భూ ఆక్రమణలకు అడ్డుకట్టేది?



ఇటీవల ఖాజీపల్లిలో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయిస్తున్న అధికారులు

- తరచూ కూల్చివేయిస్తున్నా ఫలితం శూన్యం
- కబ్జాలకు గురవుతున్న విలువైన ప్రభుత్వ భూములు
- అధికారులకు సవాలు విసురుతున్న అక్రమార్కులు
- కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపాలిటీ, వివిధ గ్రామాలు అవుటర్ రింగురోడ్డుకు సమీపంలో ఉండటంతో ఇక్కడి గ్రామాల భూములకు రెక్కలొచ్చాయి. దీంతో అక్రమార్కులు ప్రభుత్వ, శిఖం, హుడా భూములను ఆక్రమించి యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో ప్రభుత్వ భూముల రక్షణ రెవెన్యూ, ఇరిగేషన్, హుడా శాఖల అధికారులకు తలనొప్పిగా మారింది. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

బొల్లారం మున్సిపాలిటీలోని ఖాజీపల్లి, గడ్డపోతారం పారిశ్రామికవాడలు అవుటర్ రింగురోడ్డుకు సమీపంలో ఉంటాయి. ఇక్కడి భూములకు కోట్ల రూపాయల విలువ ఉంది. ఈ ప్రాంతాల్లో విల్లాలు, భారీ అపార్టుమెంట్లు ఉన్నాయి. సమీపంలో ఇంటర్‌నేషనల్ స్కూళ్లతో పాటు అన్ని వసతులు ఉన్నాయి. దీంతో అక్కడి భూములకు విలువ పెరగడంతో రింగురోడ్డు సమీప గ్రామాల్లోని కొంతమంది అక్రమార్కులు ప్రభుత్వ, శిఖం, హుడా భూములను కబ్జాలు చేసేందుకు యత్నిస్తున్నారు. ఏళ్ల కాలం నుంచి అక్రమణలు జరుగుతూనే ఉన్నాయి.

కబ్జాలు జరుగుతున్న తీరు ఇలా..

ఖాజీపల్లిలోని 181 సర్వేనంబర్‌లోని ప్రభుత్వ భూముల్లో తరచూ ఆక్రమణలు జరుగుతున్నాయి. దీంతో రెవెన్యూ అధికారులు కూల్చివేతలు జరపటంతో పాటు పలువురు అక్రమార్కులపై క్రిమినల్ కేసులను సైతం నమోదు చేస్తున్నారు.

ప్రత్యేక బృందం ఏర్పాటు చేశాం

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే సహించేది లేదు. ఎప్పటికప్పుడు అక్రమ నిర్మాణాలను కూల్చివేయిస్తున్నాం. ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశాం. భూకబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నాం.

– రవికుమార్, తహసీల్దార్, జిన్నారం

కేసులు నమోదు చేస్తాం

బొల్లారం, ఖాజీపల్లి పరిధిలో ఉన్న హుడా భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు. ఇందుకోసం తగిన బందోబస్తును ఏర్పాటు చేశాం. ప్రజలు కబ్జాలు చేసిన వారి వివరాలను తమకు ఇవ్వాలి. ప్రభుత్వ భూములను కబ్జాలు చేస్తే కేసులు నమోదు చేస్తాం.

– వెంకటేశం, హుడా సీఐ

బొల్లారం మున్సిపల్ పరిధిలోని శిఖం భూములు భారీగా కబ్జాలకు గురయ్యాయి. మున్సిపల్ పరిధిలో 24 చెరువులు, కుంటలు ఉండగా ప్రస్తుతం 10 మాత్రమే మిగిలి ఉన్నాయి. మిగతావి కబ్జాలకు గురయ్యాయి. ఈ విషయం ఇరిగేషన్‌శాఖ అధికారులకు తెలిసినా పట్టించుకోవటంలేదు. హుడా పరిధిలోని భూములను కూడా అక్రమార్కులు కబ్జాలు చేస్తున్నారు. బీసీ కాలనీలో ఉన్న హుడా భూముల్లో ఇటీవల చేపట్టిన అక్రమ నిర్మాణాలను అధికారులు కూల్చివేశారు. ఈ విధంగా తరచూ ప్రభుత్వ, శిఖం భూములు కబ్జాలకు గురవుతున్నాయి. ప్రభుత్వం స్పందించి భూఆక్రమణలను అరికట్టేందుకు చర్యలు తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చిన్నారులకు ఔషధాల పంపిణీ



చుక్కల మందు వేస్తున్న వికాస తరంగిణి అధ్యక్షుడు వీరేశం



బాలుడికి స్వర్ణామృత ఔషధం వేస్తున్న ఆయుర్వేద వైద్యుడు

నారాయణఖేడ్: పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరిగేందుకు ఐరా ఆయుర్వేదిక్ ఆస్పత్రి వారు ప్రత్యేకంగా తయారుచేసిన స్వర్ణామృత ప్రాశన ఔషధాన్ని శుక్రవారం బాలబాలికలకు పంపిణీ చేశారు. నారాయణఖేడ్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఖేడ్ కల్పనా ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ బాధ్యులు వెంకట్‌రావు, చంద్రశేఖర్, రవికుమార్ పాల్గొన్నారు.

వికాస తరంగిణి ఆధ్వర్యంలో...

జహీరాబాద్ టౌన్: వికాస తరంగిని జహీరాబాద్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం చిల్డ్రన్ హాస్పిటల్, సరస్వతి శిశుమందిరంలో పిల్లలకు స్వర్ణామృత ప్రాశన చుక్కల మందును వేశారు. ఈ సందర్భంగా వికాస తరంగిణి అధ్యక్షుడు అల్లాడి వీరేశం మాట్లాడుతూ పుష్యమి నక్షత్రంలో పుట్టిన ఆరు రోజుల నుంచి 16 ఏళ్ల వయసు కలిగిన పిల్లలకు చుక్కల మందును వేస్తున్నామన్నారు. ఇప్పటివరకు జహీరాబాద్ పట్టణంలో 304 మంది పిల్లలకు చుక్కల మందు వేశామని తెలిపారు. చుక్కల మందుతో పిల్లల్లో జ్ఞాపకశక్తి పెరుగుతుందని, ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. కార్యక్రమంలో వికాసతరంగిణి నాయకులు సాయిరెడ్డి విఠల్‌రెడ్డి, చిటుకుల వాణి, బెజుగం సంధ్య, డాక్టర్ శేషపద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన రామచంద్రాపురం పట్టణంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బొంబాయి కాలనీకి చెందిన గణేష్‌కుమార్ సెక్యూరిటీ గార్డుగా జీవనం సాగిస్తున్నాడు. కాగా గణేష్ ఈనెల 20వ తేదీన రాత్రి 11 గంటల సమయంలో మద్యం తాగి మొదట అంతస్తు నుంచి మెట్లు దిగుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయాలైన గణేష్‌కుమార్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నియామకం

కంది(సంగారెడ్డి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ టీపీసీసీ లేబర్ సెల్ అదనపు ప్రధాన కార్యదర్శిగా ఓడీఎఫ్ నాయకుడు కూన రవీందర్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రకాష్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు.

కొనసాగుతున్న దరఖాస్తుల స్వీకరణ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ పరిధిలోని జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాల్లో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి శుక్రవారం దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్ప, మాజీ కార్పొరేటర్ అంజయ్య, సీనియర్ నాయకులు ఆదర్శ్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేష్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మునిపల్లి(అందోల్): రాజకీయ పార్టీలకతీతంగా అర్హులకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందజేస్తుందని మాజీ ఎంపీపీ తాటిపల్లి రాంరెడ్డి అన్నారు. మండలంలోని తాటిపల్లి, మన్సాన్‌పల్లి, పిల్లోడి, పెద్దలోడి గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమాలను పరిశీలించారు. సర్పంచ్‌లు అంజిరెడ్డి, సతీష్‌కుమార్ తహసీల్దార్ తెన్‌మొళి, ఎంపీడీఓ హరినందన్‌రావు మాజీ జెడ్పీటీసీ పెంటయ్య, వెంకటలక్ష్మారెడ్డి, మారుతి, సంగమేశ్వర్, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఝరాసంగం(జహీరాబాద్): మండల కేంద్రమైన ఝరాసంగంతో పాటు మాచ్నూర్, బర్దీపూర్, కక్కర్‌వాడ గ్రామాల్లో ప్రజాపాలనలో భాగంగా గ్రామసభలను నిర్వహించి దరఖాస్తులను స్వీకరించారు. జహీరాబాద్ ఆర్డీఓ వెంకారెడ్డి బర్దీపూర్ గ్రామంలో దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. ప్రత్యేకాధికారి, ఏడీఏ భిక్షపతి, ఎంపీడీఓ సుజాత, తహసీల్దార్ సంజీవ్‌రావు, ఎంపీఓ లక్ష్మయ్య, మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర్, సర్పంచ్ రాజు, ఎంపీటీసీ రాజు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

మునిపల్లి(అందోల్): మండలంలోని మన్సాన్‌పల్లి, తాటిపల్లి, పిల్లోడి, పెద్దలోడి గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు ఆరు గ్యారంటీల దరఖాస్తులపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ తెన్‌మొళి, ఎంపీడీఓ హరినందన్‌రావు, సర్పంచ్‌లు అంజిరెడ్డి, సతీష్ కుమార్, శమంత, పార్వతి వెంకటలక్ష్మారెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కంది(సంగారెడ్డి): అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఎంపీడీఓ విశ్వప్రసాద్ తెలిపారు. మండలంలోని చిద్రుప్ప, బేగంపేట్, మామిడిపల్లి, కవలంపేట గ్రామాల్లో ప్రజాపాలనలో భాగంగా దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీఓ మహేందర్‌రెడ్డి, ఏఈ ప్రకాష్, సర్పంచ్ షఫీయుద్దీన్(బాబా), పంచాయతీ కార్యదర్శులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



తాటిపల్లిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రజాపాలనలో భాగంగా నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని 3, 4వార్డుల్లో కౌన్సిలర్లు దారం శంకర్, వివేకానంద్, రాజేష్‌నాయక్, నాయకులు తాహెర్, మేనేజర్ వెంకటశివయ్య పాల్గొన్నారు. అభయహస్తంలో భాగంగా ఆరు గ్యారంటీ పథకాల లబ్ధిదారుల ఎంపికపై అవగాహన కల్పించి దరఖాస్తులు స్వీకరించారు.

మనూరు(నారాయణఖేడ్): మనూరు, నాగల్‌గిద్ద మండలాల్లోని ఆయా గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమం కొనసాగుతోంది. ఈ సందర్భంగా లబ్ధిదారుల నుంచి అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, తహసీల్దార్లు షబినాబి, షాజిలోద్దీన్, కాంగ్రెస్ నాయకులు సుభాష్‌రావుపాటిల్, మాణిక్‌రావుపాటిల్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): అర్హులైనవారందరూ ఆరు గ్యారంటీ పథకాలకు దరఖాస్తులు చేసుకోవాలని డీసీసీ అధ్యక్షురాలు నిర్మలారెడ్డి ప్రజలకు సూచించారు. మండల పరిధిలోని ఆరూర్, మెలిగిర్‌పేట్ గ్రామాల్లో ప్రజాపాలన కేంద్రాలను పరిశీలించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గడీల రాంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సిద్దన్న, సర్పంచులు భూపాల్‌రెడ్డి శ్రీనివాస్, ఎంపీటీసీ శ్రీనివాస్, నాయకులు మధుకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోహీర్(జహీరాబాద్): మండలంలోని దిగ్వాల్, కావేలి, బిలాల్‌పూర్ గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి సూర్యారావు బిలాల్‌పూర్ శిబిరాన్ని సందర్శించారు. నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమం కొనసాగుతోంది. న్యామతాబాద్, ఇబ్రహీంపూర్, ఖలీల్‌పూర్, హుమ్నాపూర్, మిర్జాపూర్(బి), వడ్డి గ్రామాల్లో దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమాల్లో డీఎల్‌పీఓ రాఘవ, ఎంపీడీఓ వెంకట్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని ఆయా వార్డుల్లో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఝరాసంగం: మాచ్నూర్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



కంది: కవలంపేటలో మాట్లాడుతున్న ఎంపీడీఓ విశ్వప్రసాద్



నారాయణఖేడ్: దరఖాస్తులను స్వీకరిస్తున్న కౌన్సిలర్లు



మిర్జాపూర్(బి)లో దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు



వెల్‌నెస్ హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

మెరుగైన వైద్యం అందించండి

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర
- సంగారెడ్డిలో వెల్‌నెస్ హాస్పిటల్ ప్రారంభం

సంగారెడ్డి: పేదలకు మెరుగైన వైద్యం అందించాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. జిల్లాలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో వెల్‌నెస్ హాస్పిటల్‌ను ఎమ్మెల్యే సంజీవరెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా సంగారెడ్డిలో వెల్‌నెస్ ఆస్పత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఇక్కడ నిష్ణాతులైన వైద్యులు ఉన్నారని, వారి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. మరోవైపు హాస్పిటల్ యాజమాన్యం వారు సుమన్, వివేక్, వెంకటేష్, బటేష్, రాజేశ్వర్ మాట్లాడుతూ సంగారెడ్డిలో తమ హాస్పిటల్‌లో ఐవీఎఫ్ తల్లీపిల్లలు సంరక్షణతో పాటు కొత్తగా రిపోల్స్ అనే నూతన పద్ధతికి శ్రీకారం చుడుతున్నామని తెలిపారు. గుండె సంబంధిత వ్యాధులు, పక్షవాతం వచ్చిన వారు త్వరగా కోలుకునేవిధంగా వైద్యసేవలను అందిస్తామని చెప్పారు. సంగారెడ్డి పట్టణ వాసులకు తమ సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ జనరల్ మేనేజర్ సీతారామారావు, డీసీసీ అధ్యక్షురాలు నిర్మలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫరీదొద్దీన్ సేవలు మరువలేనివి

- రాజకీయాల్లో అజాత శత్రువు
- ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: మాజీ మంత్రి, ఎమ్మెల్సీ ఫరీదొద్దీన్ రాజకీయాల్లో అజాత శత్రువని, ప్రజలకు ఆయన చేసిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే మాణిక్‌రావు కొనియాడారు. పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో ఫరీదొద్దీన్ రెండో వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్ల పంపిణీ, బస్టాండ్ వద్ద అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మంత్రిగా, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీగా పనిచేసినా కూడా ఏమాత్రం భేషజాలు చూపని నిగర్వి అని తెలిపారు. రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకున్నారని, నిరంతరం ప్రజాసేవలో ఉండేవారని గుర్తు చేశారు. కార్యక్రమంలో టీఎస్ఐడీసీ మాజీ చైర్మన్ తన్వీర్, నాయకులు మంకాల్ సుభాష్, తట్టు నారాయణ, మచ్చేందర్, అల్లాడి నర్సింహులు, నామ రవికిరణ్‌గుప్తా, రాములు నేత, మోతిరాం, జహంగీర్, తంజిం, విజయ్‌కుమార్, గుండప్ప, నరేష్, ముత్యాల చందు, యాకూబ్, శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఫరీదొద్దీన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జాతర ఆహ్వానపత్రిక ఆవిష్కరణ

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఆల్విన్‌కాలనీలోని బండల మల్లన్న జాతర ఆహ్వాన పత్రికను శుక్రవారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 6, 7 తేదీల్లో నిర్వహించనున్న జాతర ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, కార్పొరేటర్ కుమార్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ శంకర్‌యాదవ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

జిన్నారం(పటాన్‌చెరు): మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన 25 మందికి కల్యాణలక్ష్మి; షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అదేవిధంగా గతంలో భారీ వర్షాలకు ఇళ్లు కూలిపోయిన 30మంది బాధితులకు నష్టపరిహారం చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీ రవీందర్‌గౌడ్, బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారెడ్డి, కౌన్సిలర్ చంద్రారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజేష్, బొల్లారం మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు హనుమంతరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునఃనిర్మాణానికి శంకుస్థాపన

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని మద్దికుంట గ్రామంలో పోచమ్మ ఆలయ పున:నిర్మాణానికి సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ యాదమ్మ, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అంజన్న, సర్పంచులు లక్ష్మారెడ్డి, అశోక్, ఎంపీటీసీ లలిత, నాయకులు సుధీర్‌రెడ్డి, అరిఫొద్దీన్, పాండునాయక్, ఆరిఫ్, శివకుమార్, పాషా, సురేష్, యాదయ్య, విఠల్‌రెడ్డి పాల్గొన్నారు.



పోచమ్మ ఆలయ పునఃనిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

మినీగూడ్స్ వాహనం ఢీ..

ఇద్దరికి తీవ్ర గాయాలు

పటాన్‌చెరు టౌన్: మినీగుడ్స్ వాహనం ఢీకొని ఇద్దరికి గాయాలైన సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జిన్నారం మండల పరిధిలోని నర్రగూడెం గ్రామానికి చెందిన మహమ్మద్ జావిద్ ఈ నెల 28వ తేదీన తన స్కూటీపై జిన్నారం నుంచి పటాన్‌చెరు వస్తుండగా మార్గమధ్యలో మాదారం గ్రామ సమీపంలోకి రాగానే రాథోడ్ సూర్యప్రకాష్ అనే వ్యక్తి లిఫ్ట్ అడిగాడు. దీంతో జావిద్ లిఫ్ట్ ఇచ్చాడు. ఇద్దరు కలిసి పటాన్‌చెరు వైపు వస్తుండగా వడక్‌పల్లి టీ–జంక్షన్ సమీపంలోకి రాగానే వెనుక నుంచి అశోక్ లేలాండ్ మినీగూడ్స్ వాహనం స్కూటీని ఢీకొట్టింది. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన జావీద్ శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ఫిల్టర్ల కూల్చివేత

సంగారెడ్డి టౌన్: ఇసుక అక్రమ ఫిల్టర్లను సంగారెడ్డి రెవెన్యూ అధికారులు శుక్రవారం కూల్చివేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి మండల పరిధిలోని ఇస్మాయిల్‌ఖాన్‌పేట్, కంది మండల పరిధిలోని బ్యాతోల్ శివారులో అనుమతులు లేకుండా ఇసుక ఫిల్టర్లు నిర్వహిస్తున్నారని సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నాలుగు వాహనాలను సీజ్ చేసి 120 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా ఇసుక ఫిల్టర్లు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమంగా ఇసుక ఫిల్టర్ చేస్తున్న వారిపైన కేసులు నమోదు చేశామని తెలిపారు. దాడుల్లో సంగారెడ్డి, కంది తహసీల్దార్లు, సంగారెడ్డి పోలీసులు పాల్గొన్నారు.



ఇసుక ఫిల్టర్‌ను కూల్చివేయిస్తున్న అధికారులు